సాక్షి తిరుపతి

మంగళవారం । 2 । జూలై । 2024



స్టాఫ్ డయేరియా..

స్టాప్ డయేరియా పోస్టర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ ధ్యాన్‌చంద్ర వైద్యాధికారులతో కలిసి ఆవిష్కరించారు. - 8లో



ఎట్టకేలకు నోటిఫికేషన్

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఉన్నత విద్యాశాఖ సోమవారం ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. - 8లో



'ఎర్ర'స్మగ్లర్ అరెస్ట్

అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్ అవస్థలు

తిరుపతి సిటీ: ఇంజినీరింగ్ అడ్మిషన్లలో భాగంగా సోమవారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ఇంటర్నెట్ సెంటర్లలో ఉదయం నుంచి ఏపీ ఈఏఎమ్‌సెట్–2024లో అర్హత సాధించిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు క్యూ కట్టారు. కానీ వెబ్‌సైట్ మొరాయించడంతో నిరుత్సాహంతో వెనుదిరిగారు. సాంకేతిక కారణాలతో వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదని, కొన్ని గంటల్లో సమస్యను పరిష్కరిస్తామని ఉన్నత విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. కాగా ఈ నెల 4వ తేదీ వరకే ఫీజు ప్రాసెసింగ్, రిజిస్ట్రేషన్ ప్రకియకు ప్రభుత్వం గడువు విధించింది.

ఏపీపీకి అదనపు బాధ్యతలు

తిరుపతి లీగల్: తిరుపతి ఆరవ అదనపు ప్రత్యేక మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జ్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏ.ప్రేమ్‌సాగర్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం ఆయన పాకాల మేజిస్ట్రేట్ కోర్టు ఏపీపీగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే నూతన క్రిమినల్ చట్టాలు రావడంతో తిరుపతి జిల్లా పోలీసులకు ఆ చట్టాలపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన లీగల్ హెల్ప్ డెస్క్ నిర్వహణ బాధ్యతలను కూడా ఆయనకు అప్పగించారు.

ప్రజా పరిష్కార వేదికకు 55 ఫిర్యాదులు



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 55 ఫిర్యాదులు అందినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. వెంటనే వీటిని పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించినట్టు వెల్లడించారు.

నూతన చట్టాలపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తిరుపతి లీగల్ : దేశంలో సోమవారం నుంచి నూతన క్రిమినల్ చట్టాలు అమలు కావడాన్ని న్యాయవాదులు స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి కోర్టుల ప్రధాన ద్వారం వద్ద సంఘీభావం ప్రకటిస్తూ న్యాయవాదులు నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ భారతీయ ఆలోచనలతో రూపుదిద్దుకున్నవే నూతన చట్టాలని అన్నారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను ప్రక్షాళన చేసి కేంద్ర ప్రభుత్వం నూతనంగా క్రిమినల్ చట్టాలను తీసుకురావడం ఆనందదాయకమన్నారు. కాలం మారుతున్న దృష్ట్యా నేరాలు సైతం కొత్త పుంతలు తొక్కుతున్నాయని, వాటికి చెక్ పెట్టేందుకు కొత్త చట్టాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, న్యాయవాదులు కె.అజయ్ కుమార్, శ్రీనివాస్, జనసేన లీగల్ సెల్ నాయకులు ముక్కు సత్యవంతుడు, మురళి, టీడీపీ లీగల్ సెల్ నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

తలకోన సిద్ధేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీసిద్ధేశ్వర స్వామివారు

భాకరాపేట: తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు చేపట్టారు. జంగమ దేవర్లు శంఖు, గంటానాథంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. శ్రీసిద్ధేశ్వర స్వామి, శ్రీసిద్ధేశ్వరి అమ్మవారికి జరిగిన విశేష పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తి మార్గంతోనే ముక్తి



గరికపాటి రమేష్‌బాబు

తిరుపతి కల్చరల్: మనిషికి భక్తి మార్గమే ముక్తి మార్గమని ప్రవచన కర్త గరికపాటి రమేష్‌బాబు ఉద్ఘాటించారు. అన్నమాచార్య కళామందిరంలో సోమవారం ఆయన ఆంధ్ర మహాభారతం సౌప్తిక పర్వంపై ప్రవచనం చేశారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆయన ప్రవచనం సభికులను విశేషంగా ఆకట్టుకుంది.

ఇంటింటికీ మంగళం

పింఛన్ల పంపిణీ మళ్లీ మొదటికి

- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు
- గంటల తరబడి క్యూలో నిరీక్షణ
- ఇంటింటికీ కాదు.. సచివాలయాలు, నడివీధిలోనే..
- స్థానిక ఎమ్మెల్యేలు వచ్చే వరకు వేచి ఉన్న లబ్ధిదారులు
- అధికారిక కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా మార్చిన కూటమి నేతలు

పెన్షన్ల పంపిణీ మళ్లీ మొదటికొచ్చింది. ఐదేళ్ల క్రితం టీడీపీ పాలనలో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం పడ్డ కష్టాలు మళ్లీ కళ్లెదుట మెదలాడాయి. ఎన్నికల ముందు వలంటీర్లు లేకపోయినా ఇంటి వద్దకే పెన్షన్లు ఇస్తామన్న కూటమి పెద్దలు సోమవారం సచివాలయాలు, నడివీధుల్లో గంటలు తరబడి నిల్చోబెట్టి పంపిణీ చేశారు. ఈ పరిస్థితిని చూసి లబ్ధిదారులు 'ఏందయ్యా.. ఇంటికే తెచ్చి ఇస్తామన్నారు కదా? మళ్లీ ఏమైంది. ఇందుకేనా మేము ఓట్లేసింది' అంటూ నిట్టూర్చడం కనిపించింది. దీనికితోడు గంటల తరబడి వేచి ఉంచి.. కూటమి నేతల సొంత డబ్బు ఇచ్చినట్లు హడావుడిచేయడం విమర్శలకు తావిచ్చింది.



చంద్రగిరి మండలం, నాగాలచెరువు గ్రామ రచ్చబండ వద్ద ఉదయం 11 గంటల సమయంలో పింఛను కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



ఏర్పేడు మండలం, చెన్నంపల్లిలో పింఛన్ల కోసం ఎదురుచూపు

సాక్షి, తిరుపతి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సోమవారం ఉదయం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తీవ్ర ఒడిదుడుకుల నడుమ ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల పాటు వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి తలుపు తట్టి పెన్షన్ ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన మొదటి నెల పింఛన్ల పంపిణీ అందుకు విరుద్ధంగా సాగింది. సచివాలయ సిబ్బంది చేత ఇంటింటికీ పంపిణీ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ పెద్దలు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. వేకువజామున 5.30 గంటల నుంచి సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ ఉంటుందని లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు ఇంటికే వచ్చి ఇస్తామన్నారు కదా? మళ్లీ ఇదేం పంచాయితీ అనడంతో.. లేదు లేదు లబ్ధిదారుల నివాసానికే వచ్చి ఇస్తామని చెప్పారు. విషయం తెలియని వారు అనేక మంది లబ్ధిదారులు వేకువజాము 5.30 గంటలకే సచివాలయాలకు చేరుకున్నారు. మరికొందరు ఇంటివద్దే వేచి ఉన్నారు. ఉదయం 6 గంటలు దాటుతున్నా సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు కనిపించకపోవడంతో వీధుల్లో గుంపులు గుంపులుగా వేచి చూశారు. మరికొన్ని చోట్ల స్థానిక ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ చేస్తారని.. లబ్ధిదారులంతా ఓ చోటుకు రావాలంటూ సమాచారం ఇచ్చారు. ఒక చోట అలా.. ఇంకో చోట మరోలా పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ ఇబ్బందులు చాలవన్నట్టు.. సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల నగదు తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు మరింత సమయం వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.



తిరుపతిలోని సప్తగిరి నగర్‌లో ఓ ఇంటి వద్ద పింఛన్ కోసం గుమికూడిన లబ్ధిదారులు

పార్టీ కార్యక్రమాన్ని తలపించిన పింఛన్ల పంపిణీ

ప్రభుత్వం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ కాస్త కూటమి పార్టీల కార్యక్రమంలా మారింది. స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేలచేత పింఛన్ల పంపిణీ చేపట్టిన ప్రాంతాల్లో వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అనేక మంది ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి ఆలస్యంగా రావడం.. మరి కొంతమంది ఎమ్మెల్యేలు ఒకే రోజు నియోజకవర్గంలోని ముఖ్యమైన పంచాయతీలు, మండల కేంద్రాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో లబ్ధిదారులు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఎమ్మెల్యేలు ఒక చోట పంపిణీ ప్రారంభించిన తరువాత మరొక చోటుకు వెళ్లే వరకు వృద్ధులు, దివ్యాంగులు వేచి ఉండక తప్పలేదు. అలా అనేక చోట్ల ఎమ్మెల్యేల కారణంగా లబ్ధిదారులకు తిప్పలు పడాల్సి వచ్చింది. మరోవైపు ఎమ్మెల్యేలు లేకపోయినా.. ఏ హోదా లేని కూటమి నేతలు అధికారక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలే పింఛన్ల పంపిణీ చేపట్టారు. పింఛన్ల పంపిణీ కోసం కూటమి శ్రేణులు నేనా? నువ్వా? అన్నట్టు పోటీపడ్డారు. తిరుమల బాలాజీ నగర్‌లో చేపట్టిన పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటో లేకపోవడంతో జనసేన శ్రేణులు కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. ఇదిలావుండగా.. సోమవారం రాత్రి 7గంటల సమయానికి తిరుపతి జిల్లా వ్యాప్తంగా 95.19శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మొత్తం 2,69,162 మంది లబ్ధిదారులకు గాను 2,56,202 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు వెల్లడించారు. మిగిలిన వారికి మంగళవారం పింఛన్లు అందిస్తామని ఆయన వెల్లడించారు. కాగా వడమాలపేటలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. చిత్తూరు జిల్లాలో 2,71,253 మందికిగాను రూ.181 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. సాయంత్రం 6 గంటలకు 2,53,287 మందికి రూ.169 కోట్లు పంపిణీ చేశారు. అంటే.. చిత్తూరు జిల్లాలో 93.38శాతం పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన వారికి మంగళవారం అందిస్తామని స్పష్టం చేశారు.



కట్టకింద ఊరులో సర్వర్ పని చేయక నిరీక్షిస్తున్న పండుటాకులు



తిరుపతిలోని బ్రాహ్మణవీధి, బజారు వీధిలో సర్వర్ పనిచేయక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



ఏర్పేడు: చెన్నంపల్లిలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



తిరుపతి : సచివాలయ ఉద్యోగి వెంట వెళ్తున్న లబ్ధిదారులు



తిరుపతి : ఉదయం నుంచి ఇంటి వద్దే నిరీక్షిస్తున్న లబ్ధిదారు



తిరుపతి : 33వ డివిజన్ సచివాలయం వద్ద నిరీక్షణ

తిరుమలలో పకడ్బందీగా పారిశుద్ధ్య చర్యలు

తిరుమల: తిరుమలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా అత్యున్నత ప్రమాణాలతో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని అధికారులను టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆదేశించారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో సోమవారం టీటీడీ జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఈవో సమీక్షించారు. సిబ్బంది పనితీరు, యాంత్రీకీకరణతోపాటు ఇతర అంశాలపై ఆయన చర్చించారు. అంతకుముందు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పలు సమస్యలను ఈఓకు తెలియజేశారు. భక్తుల క్యూలు విస్తరించిన ప్రాంతంలో తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల పారిశుద్ధ్యం పనితీరులో లోపం, సమయానికి శానిటరీ మెటీరియల్‌ను ఏజెన్సీలు సరఫరా చేయకపోవడం, నాణ్యత లేని క్లీనింగ్ సామాన్లు సరఫరా చేయడం తదితర విషయాలను ఆయనకు నివేదించారు.

మూడు రోజుల్లో మార్పు రావాలి

పలు సమస్యలను సావధానంగా విన్న ఈఓ, కాంట్రాక్టర్లను కఠినంగా హెచ్చరించాలని, నిబంధనల ప్రకారం సరిపడా సిబ్బంది, మెటీరియల్ సరఫరా చేసి తిరుమలలో పరిశుభ్రత చర్యలను మెరుగుపరిచేందుకు మూడు రోజుల సమయం ఇవ్వాలని జేఈఓలను ఆదేశించారు. మూడు రోజుల తర్వాత ఆకస్మికంగా తనిఖీలు చేసేందుకు సీనియర్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి, తదుపరి చర్యలు తీసుకోవడానికి పారిశుద్ధ్యంపై సవివరమైన నివేదిక ఇవ్వాలని ఆయన జేఈఓలను ఆదేశించారు. తిరుమల, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే భక్తుల్లో సంస్థకు చెడ్డపేరు వస్తుందన్నారు. తిరుమలలో ప్రాంతాల వారీగా, షిఫ్ట్‌ల వారీగా అవసరమయ్యే కార్మికుల జాబితా, అంచనా వేసి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఈఓ (హెల్త్) హరికృష్ణ, ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీదేవి, ఈఈ ఎఫ్ఎంఎస్ శ్రీనివాసరావు, ఆరోగ్యశాఖ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

ఘనంగా జీఎస్టీ డే వేడుకలు

తిరుపతి రూరల్: జాతీయ 8వ జీఎస్టీ డే వేడుకలను సోమవారం తిరుపతిలోని జీఎస్టీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ జీఎస్టీ తిరుపతి కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ బ్రిజ్‌లాల్ మీనా అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకలకు ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, ఐసీఏఐ మాజీ జాతీయ చైర్మన్ ఫల్గుణకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తిరుపతి కమిషనరేట్ పరిధిలో ఉత్తమ పన్ను చెల్లింపు చేసిన సంస్థలు కడపకు చెందిన శ్రీషిరిడీ సాయి ఎలక్ట్రికల్స్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, శ్రీసిటీకి చెందిన శ్రీసిటీ ప్రైవేటు లిమిటెడ్, ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్, ఏర్పేడుకు చెందిన ఫుష్‌పిట్ స్టీల్స్, కర్నూలుకు చెందిన జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్, ప్రొగ్రెస్సో సంస్థలకు అవార్డులను అందించారు. అలాగే ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులు రమామణి, జగన్‌నాయక్, కుమార్‌గౌరవ్‌దోషి, దేవేందర్, జైకిషన్, సత్యనారాయణమూర్తి, కౌషిక్, రాజశేఖర్, బాలాజీ, ధనపాల గోపి, వెంకటరమణను సత్కరించారు.



షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ జీఎంకు అవార్డు అందిస్తున్న ఫల్గుణకుమార్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 49 అర్జీలు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు తగ్గాయి. కేవలం 49 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూశాఖకు సంబంధించి 38 అర్జీలు ఉన్నాయి. సంబంధిత అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్రరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఇదిలావుండగా తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో నిషాంత్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. వాటికి పరిష్కారం చూపించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ధ్యానచంద్ర

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,005 మంది స్వామివారిని దర్శించుకోగా 28,244 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.83 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

కోట: జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు కోట ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఏ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థి ఐ.శివయ్య 48 కిలోల విభాగంలో, జూనియర్ ఇంటర్ విద్యార్థి బీ.రాకేష్ 45 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు వివరించారు. జూలై 5వ తేదీ నుంచి ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తోపాటు పీడీ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించండి

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్‌కు, అసెంబ్లీకి పోటీచేసిన అభ్యర్థులు తమ ఖర్చు వివరాలను ఈ నెల 4వ తేదీ లోపు సమర్పించాలని కలెక్టర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఆమేరకు సోమవారం కలెక్టరేట్‌లో తిరుపతి పార్లమెంట్ ఎక్స్‌పండేచర్ అబ్జర్వర్ ప్రదీప్ కుమార్, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాల అబ్జర్వర్లు మీను ఓలా, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలక అబ్జర్వర్లతో కలసి వివిధ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు వెల్లడైన 30 రోజుల్లోపు ప్రతి అభ్యర్థీ తమ వ్యయ వివరాల బిల్లులను అప్పగించాలని సూచించారు. పరిమితికి మించి ఖర్చు చేసినా, లెక్కలను సరైన సమయంలో చూపకున్నా ఆ అభ్యర్థులపై అనర్హత వేటు పడడంతోపాటు తర్వాత ఎన్నికల్లో పోటీచేసే అర్హత కూడా కోల్పోతారని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 156 మంది అభ్యర్థులు పోటీ చేశారని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యయ పరిశీలక నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు, అన్ని నియోజకవర్గాల సహాయ వ్యయ పరిశీలన అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ధ్యానచంద్ర

క్లుప్తంగా

కానిస్టేబుల్ ఉద్యోగాలు త్వరగా భర్తీ చేయాలి

- ఏఎస్పీకి విన్నవించిన అభ్యర్థులు



నిరసన తెలియజేస్తున్న అభ్యర్థులు

తిరుపతి క్రైమ్: గత ప్రభుత్వంలో 2022లో వెలువడిన కానిస్టేబుల్ ఉద్యోగాలు త్వరగా భర్తీ చేయాలని అభ్యర్థులు సోమవారం జిల్లా ఏఎస్పీ వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దాదాపు రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ ఇచ్చిన కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో 6,100 ఉద్యోగాలకు 95,208 మంది అభ్యర్థులు రాత పరీక్షలో అర్హత సాధించారన్నారు. ఆ తర్వాత ఇందులోని లోపాలను ఎత్తిచూపుతూ కోర్టుకెక్కడంతో భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో పడిందన్నారు. ఇప్పటికైనా ఈ ఉద్యోగాల నియామకాలు త్వరగా పూర్తిచేయాలని వారు విన్నవించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతుడు వెంకటేశ్వర్లు (ఫైల్)

దక్కిలి: విద్యుత్‌షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. మండలంలోని కొత్తనాళ్లపాడు (రామరాజుపల్లి) గ్రామానికి చెందిన పామూరు వెంకటేశ్వర్లు (49) తన గెదేల కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. దీనికి తన ఇంట్లో నుంచి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకుని ఉన్నారు. రేకులు దగ్గర ఓ విద్యుత్ వైరును తీగ లాగా ఏర్పాటు చేసి ఉండడంతో ఆ తీగకు విద్యుత్ సరఫరా అయ్యింది. ఈ విషయం గమనించని వెంకటేశ్వర్లు దానికి తగలడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో కొత్తనాళ్ల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అమల్లోకి కొత్త క్రిమినల్ చట్టాలు

- వివరించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



తిరుపతి క్రైమ్: కొత్త చట్టాలు అమల్లోకి వచ్చినట్టు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నూతన చట్టాల గురించి వివరించారు. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేర చట్టాలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. గతంలో అమల్లో ఉన్న భారత శిక్షాస్మృతి (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్పీసీ), భారత సాక్ష్యాధార చట్టాల చరిత్ర జూన్ 31వ తేదీ అర్ధరాత్రితో ముగిసినట్టు వెల్లడించారు.

కొత్త చట్టాలు.. వాటి అమలు



- కొత్త చట్టాలతో జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో సమన్లు పంపడం, హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్లను తప్పనిసరిగా వీడియోల్లో బంధించడం వంటి ఆధునిక పద్ధతులు న్యాయ వ్యవస్థలో రానున్నాయి.
- భారతీయ శిక్షాస్మృతిలోని రాజద్రోహాన్ని ఇప్పుడు దేశద్రోహంగా మార్చారు. కులం, మతం వంటి కారణాలతో సామూహిక దాడులు, హత్యకు పాల్పడితే ఐపీసీ ప్రకారం ఏడేళ్ల వరకు శిక్ష పడేది. దీన్నిప్పుడు యావజ్జీవంగా మార్చారు. హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్ల వీడియో చిత్రీకరణ తప్పనిసరి చేశారు.
- నకిలీ నోట్ల తయారీ, వాటి స్మగ్లింగ్ ఉగ్రవాదం పరిధిలోకి వస్తుంది. విదేశాల్లో మన ఆస్తులు ధ్వంసాన్ని ఉగ్రవాదంగా నిర్వచించారు. డిమాండ్ల సాధనకు వ్యక్తులను బంధించడం, కిడ్నాప్ చేయడాన్ని ఉగ్రవాదం పరిధిలోకి చేర్చారు.
- మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించి కొత్త అధ్యాయాన్ని జోడించారు. పిల్లల్ని కొనడం, అమ్మడం ఘోరమైన నేరంగా మార్చారు. మైనర్‌పై సామూహిక అత్యాచారానికి మరణ శిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన తెచ్చారు. పెళ్లి చేసుకుంటానన్న తప్పుడు వాగ్దానాలతో లైంగిక సంబంధాలు పెట్టుకుని మహిళలను వదిలేయడం వంటి కేసులకు కొత్త నిబంధన పెట్టారు. మహిళలు, పిల్లలపై నేరాల్లో బాధితులకు అన్ని ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స లేదా ఉచిత వైద్యం అందించాలి. మహిళలు, 15 ఏళ్ల లోపు, 60 ఏళ్లు పైబడిన వ్యక్తులు, వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఇంటి నుంచే పోలీసు సాయం పొందవచ్చు. కోర్టు అనుమతి లేకుండా లైంగిక దాడి గురించి ప్రచురిస్తే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.
- ఫిర్యాదుల నుంచి సమన్లదాకా అన్నీ ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. పోలీసు స్టేషన్‌కు వెళ్లే పని లేకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా సమన్లు పంపవచ్చు. పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్లో అయినా ఎఫ్ఐఆర్ దాఖలు చేసే జీరో ఎఫ్ఐఆర్ విధానం ప్రవేశపెట్టారు. అరెస్టయిన వ్యక్తి కుటుంబానికి, స్నేహితులకు సమాచారాన్ని పంచుకునే వీలు కల్పించడంతోపాటు వివరాలను పోలీస్ స్టేషన్లలో ప్రదర్శిస్తారు.
- ఈ నూతన చట్టాలపై జిల్లా పోలీసు అధికారులకు సిబ్బందికి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టారు. నిరంతరం పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వ న్యాయవాదులు అందుబాటులో ఉంటారు. అధికారులు పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సంకలన్ యాప్‌ను కూడా విడుదల చేశారు. ఇందులో పాత సెక్షన్ నమోదు చేస్తే నూతన సెక్షన్ వచ్చే విధంగా రూపొందించారు.

4న విద్యాసంస్థలు బంద్



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

తిరుపతి కల్చరల్: నీట్ నెట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఎన్ఎస్‌యూఐ నేత మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి పిలుపు నిచ్చారు. ఈమేరకు యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. నీట్ ప్రవేశ పరీక్షలో దేశ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో ఈ ఏడాది అవకతవకలు జరిగాయన్నారు. ఈ నీట్ పరీక్ష నిర్వహించే ఎన్‌టీఏను రద్దు చేయాలని బాధిత విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రికి మొరపెట్టుకున్నా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకులకు కారణమైన నేషనల్ టెస్టింగ్‌ల ఏజెన్సీని రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు 4వ తేదీన జరిగే బంద్‌లో విద్యార్థి సంఘాలను కలుపుకొని ఎల్‌కేజీ నుంచి పీజీ విద్యార్థుల వరకు బంద్ చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్, నాయకులు హరికృష్ణ, వినోద్, తేజ, బాల, ఉమేష్, శివ పాల్గొన్నారు.

సీఏ–2కే రన్



సీఏ-2కే రన్‌లో చార్టర్డ్ అకౌంటెంట్స్ ప్రతినిధులు, సభ్యులు

తిరుపతి కల్చరల్: సీఏ దినోత్సవాన్ని పురస్కరించుకొని వికసిత్ భారత్‌లో భాగంగా అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో సీఏ–2కే రన్‌ను ఘనంగా నిర్వహించారు. అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ వారి కార్యాలయం నుంచి బాలాజీ కాలనీ సర్కిల్ మీదుగా ఎస్వీ యూనివర్సిటీ రోడ్డు మెయిన్ గేట్ వరకు ఈ రన్ చేపట్టారు. అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ తిరుపతి శాఖ అధ్యక్షుడు జీ.రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వపు ఎస్ఐఆర్‌సీ అధ్యక్షుడు ఫల్గుణకుమార్, ఉపాధ్యక్షుడు బీవీ. మధుసూదనబాబు, కార్యదర్శి సింహాద్రి నాయుడు, కోశాధికారి బాలాజీ కామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు జైలు

తిరుపతి లీగల్: అధిక మోతాదులో మద్యం తాగి, నిర్లక్ష్యంగా తిరుపతిలో ఆటో నడిపిన కేసులో తిరుపతి కొర్లగుంటకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ కాజాకు రెండు రోజుల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. అలాగే తిరుపతిలో స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు 14 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరపరిచారు.

కొమ్మల కత్తిరింపు తప్పనిసరి



రాజగోపాలపురంలో మామిడితోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారిణి

సత్యవేడు: మామిడి తోటల్లో కాయల కోత అనంతరం చెట్టుకి 30–45 రోజుల విశ్రాంతి తర్వాత కొమ్మల కత్తిరింపు చేపట్టాలని ఉద్యాన అధికారి ఆర్.రాధారాణి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో రైతులతో ఆమె మాట్లాడుతూ చెట్టులోపలి భాగంలో అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను తీసివేస్తే చెట్టులోపల భాగాలలో గాలి, వెలుతురు ప్రసరణకు అనువుగా ఉంటుందన్నారు. చెట్టులోపల నిటారుగా పెరిగే కొమ్మలను, తెలుగు సోకిన కొమ్మలు, ఎండిన కొమ్మలు ఉంటే తీసివేయాలన్నారు. కోత అనంతరం తప్పని సరిగా చెట్టుకు పోషకాలు అందించాలని చెప్పారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

నాగలాపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన సోమవారం మండలంలోని తూర్పు దళిత వాడలో చోటుచేసుకుంది. స్థానిక రెవెన్యూ అధికారుల కథనం.. తూర్పు దళితవాడకు చెందిన లక్ష్మణన్ ఇంట్లో ఆదివారం రాత్రి రెండు, మూడు సార్లు విద్యుత్ అంతరాయం కలిగింది. అనంతరం 15 నిమిషాల తరువాత విద్యుత్ సరఫరా రావడంతో ఇంట్లోని ఏసీ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. ఆ తర్వాత ఇంట్లోని విద్యుత్ తీగలన్నీ కాలిపోయాయి. ఇంట్లోని వస్తువులు సైతం కాలిబూడిదయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న లక్ష్మణన్, అతని భార్య, ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో 50 వేల రూపాయల నగదు, 10 సవరాల బంగారం, 50 వేల విలువగల దుస్తులు, లక్ష విలువ గల మంచం, ఫ్రిడ్జి, మిక్సీ, గ్రైండర్, వాషింగ్ మిషన్ తదితర గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఘటనా స్థలాన్ని సోమవారం తహసీల్దారు నరసింహులు, ఎంపీడీఓ పీఎంకే.బాబు, నాగభూషణం పరిశీలించి, వివరాలను సేకరించారు. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ఆపై బాధిత కుటుంబానికి రెవిన్యూ అధికారులు 50 కిలోల బియ్యం అందించారు. అలాగే విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు.

శ్రీవారి ఆలయ అర్చకులు, ఆగమ సలహాదారులతో సమీక్ష



ఆగమ సలహాదారులు, అర్చకులతో సమీక్షిస్తుస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల: శ్రీవారి ఆలయానికి సంబంధించిన పలు ఆచార వ్యవహారాలు, వైఖానస ఆగమోపచారాలు, పలు అంశాలపై ఆలయ అర్చకులు, ఆగమ పండితులతో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు సమీక్షించారు. సమీక్షలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, ఆగమ సలహాదారులు, ప్రధాన అర్చకులు, తిరుమల శ్రీవారి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు తిరుమలలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా జరుగుతున్న వివిధ ఆచారాలు, కైంకర్యాల గురించి ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు, శ్రీకృష్ణ శేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు ఈఓకు వివరించారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలోని వేద విద్యార్థులకు అప్రెంటీస్‌గా అవకాశం కల్పించి, వారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అర్చకులు ఈఓను కోరారు. గతంలో ప్రతి సోమవారం ఆర్జిత సేవగా నిర్వహించే విశేష సేవను కనీసం ఏడాదిలో ఒక్కసారైనా నిర్వహించాలని ఈఓను కోరారు. అనంతరం తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామి ఆలయానికి చెందిన శ్రీనివాస దీక్షితులు మాట్లాడుతూ, కోవిడ్ కాలంలో తగ్గించిన ప్రసాద దిట్టం ఇంకా కొనసాగుతూనే ఉందని, దానిని పెంచాలని ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆగమ సలహాదారులు ఆలయం ప్రతిష్టకు భంగం కలుగకుండా పురాతన సంప్రదాయాలు పరిరక్షించడంలో, ఆచారాలకు విఘాతం కలుగకుండా చూసుకోవడంలో తమ పాత్రను ఈఓకు తెలియజేశారు. ఈ సమావేశాల అనంతరం శ్రీవారి అన్నప్రసాదాలపై ఆలయ, పోటు అధికారులతో ఈఓ సమీక్షించారు. సమావేశంలో ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, సీతారామాచార్యులు, శ్రీరామకృష్ణ దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోరేవారు వైద్యులు

ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: సమాజ శ్రేయస్సును కోరే వారిలో వైద్యులు ఎల్లప్పుడూ ముందుంటారని, కోవిడ్ కష్ట కాలంలో వైద్యులు అందించిన సేవలు కొనియాడదగినవని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. స్విమ్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కుమారుడు ఆరణి శివకుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, స్విమ్స్ సంచాలకుడు డాక్టర్ ఆర్‌వీ.కుమార్, ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిపాయి మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వైద్య సేవలందించారని కొనియాడారు. స్విమ్స్ సంచాలకుడు డాక్టర్ ఆర్‌వీ.కుమార్ మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవంగా ప్రతి ఏటా డాక్టర్ విధాన్ చంద్ర రాయ్ జ్ఞాపకార్థం డాక్టర్స్‌డే నిర్వహించడం జరుగుతోందన్నారు. స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ సునీత సుబ్రమణ్యం, డాక్టర్ సుకుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆశాలత, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్ఎం డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ శివశంకర్, డాక్టర్ మునస్వామి, స్విమ్స్ వైద్యులు, ఐఎంఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండో విడత అడ్మిషన్లకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రవీంద్రరెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7 ప్రభుత్వ, 10 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్ పొందే వెసులుబాటు ఉందన్నారు. www.iti. ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించవచ్చని వెల్లడించారు. రెండో విడతలో అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వ కళాశాలలకు 27, 28 ప్రైవేట్ కళాశాలలకు 29,30 తేదీల్లో సంప్రదించాలని సూచించారు.

24లోపు ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

పుంగనూరు : మైనారిటీ ఐటీఐలో ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఒక సంవత్సరం కోర్సుల్లో మెకానిక్ డీజిల్, వెల్డర్, ఫ్యాషన్‌డిజైనింగ్ ఉన్నాయన్నారు. రెండేళ్ల కోర్సుల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, మోటారు వెహికల్ మెకానిక్ ఉన్నాయని వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని కోరారు. ఇతర వివరాలను కళాశాలలోనే సంప్రదించాలని సూచించారు.

స్టాప్ డయేరియా పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: ఐదేళ్ల లోపు చిన్నారుల్లో డయేరియా మరణాల్ని నిరోధించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన వైద్యాధికారులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 'స్టాప్ డయేరియా' ప్రచార కార్యక్రమాన్ని రూపొందించిందని చెప్పారు. ఈనెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలకు 2 ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు 14 రోజులకు సరిపడా జింక్ ట్యాబ్లెట్లను అందజేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు గాను 2 నెలల పాటు సుదీర్ఘ ప్రచార కార్యక్రమాన్ని కూడా నిర్వహించాలని చెప్పారు. డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీహరి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి శాంతకుమారి, జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి బాలకొండయ్య, ఈపీఎంఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర 'ఎర్ర' స్మగ్లర్ అరెస్ట్

- తలకోన అడవుల్లో ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- కొనసాగుతున్న కూంబింగ్

భాకరాపేట : అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకుని తిరుపతి రెడ్ శ్యాండిల్ కోర్టులో హాజరు పరచినట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. ఆయన కథనం.. కార్యాలయానికి అందిన రహస్య సమాచారం మేరకు సోమవారం తలకోన సౌత్ బీట్‌లో కూంబింగ్ నిర్వహించారు. ఈ కూంబింగ్‌లో 116 కేజీలు బరువు గల 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ వీరిని గమనించి పారిపోయిన ఆరుగురు స్మగ్లర్ల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అలాగే కర్ణాటక రాష్ట్రం హోస్కోటకు చెందిన స్మగ్లర్ సలావుద్దీన్‌ఖాన్ అదుపులోకి తీసుకున్నారు. తలకోన అడవుల్లో ఎర్రచందనం స్మగ్లర్లు తిష్ట వేసినట్లు సమాచారం ఉండడంతో కూంబింగ్ కొనసాగిస్తున్నారు. దాడుల్లో ఎఫ్ఎస్ఓ సలాఉద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు నిఖిల్, రాజేష్, ప్రదీప్‌చంద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హమ్మయ్య!.. ఎట్టకేలకు నోటిఫికేషన్

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం
- నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి
- అటానమస్ హోదాలో అడ్మిషన్లకు సిద్ధమైన టీటీడీ విద్యాసంస్థలు

తిరుపతి సిటీ: ఎట్టకేలకు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునేందుకు ఉన్నత విద్యాశాఖ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో మూడు నెలలుగా ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు కాస్త ఉపశమనం లభించింది. మంగళవారం నుంచి 10 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. జూలై 4 నుంచి 6 వరకు కేటగిరీ వెరిఫికేషన్ చేయనున్నారు. 5వ తేదీ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం జూలై 11 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు వెసులుబాటు కల్పించింది. జూలై 19న విద్యార్థులకు సీట్లు కేటాయించనుంది. జూలై 20 నుంచి 22 లోపు సీట్లు కేటాయించబడిన కళాశాలల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

అటానమస్ హోదాలో తొలిసారి అడ్మిషన్ల ప్రక్రియ

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, పద్మావతి కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో తొలిసారి అటానమస్ హోదాలో అడ్మిషన్లకు పూనుకోనున్నారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 22 విభాగాల్లో 1,470 సీట్లు, పద్మావతి డిగ్రీ కళాశాలలో 1,550, ఎస్‌జీఎస్‌లో 1,068 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు (ఓఏఎంబీసీ) ఆన్‌లైన్ అడ్మిషన్స్ మోడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ అనే వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

అగ్రశ్రేణి సీజీఎస్‌టీ చెల్లింపు సంస్థలుగా శ్రీసిటీ

- శ్రీసిటీ, ఐఎఫ్‌ఎఫ్‌లకు అవార్డులు



అగ్రశ్రేణి పన్ను చెల్లింపుదారుగా శ్రీసిటీకి అందజేసిన ట్రోఫీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్‌టీ) కమిషనరేట్ పరిధిలో వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి కార్యాలయ ఆవరణలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డుల కార్యక్రమంలో శ్రీసిటీకి ప్రత్యేక గుర్తింపు దక్కింది. సీజీఎస్‌టీ చెల్లింపులలో అగ్రశ్రేణి సంస్థలుగా గుర్తించి అవార్డులకు ఎంపిక చేసిన ఆరింటిలో శ్రీసిటీ ప్రైవేట్ లిమిటెడ్ అక్కడ పరిశ్రమలలో ఒకటైన ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎఫ్ఎఫ్) ఎంపికయ్యాయి. ముఖ్య అతిథిగా అడిషనల్ కమిషనర్ బ్రజ్ లాల్ మీనా, జాయింట్ కమిషనర్ హరిహరన్, చార్టెడ్ అకౌంటెంట్ ఇ. ఫాల్గుణ కుమార్ ఎంపికైన ఆరు సంస్థలకు అవార్డులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సీజీఎస్‌టీ వసూళ్లలో వైజాగ్ ప్రథమ స్థానం పొందగా, రూ. 8వేల కోట్ల రెవెన్యూ సాధించడం ద్వారా తిరుపతి కమిషనరేట్ రెండో స్థానంలో నిలిచింది. సీజీఎస్‌టీ వసూళ్లలో సాంకేతికత కీలక పాత్ర పోషించిందని, జీడీపీ వృద్ధికి వస్తు సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉందని ఫాల్గుణ కుమార్ అన్నారు. శ్రీసిటీ తరపున శ్రీసిటీ డైరెక్టర్ (ఫైనాన్స్) డి.సుధాకర్ రెడ్డి, ఐఎఫ్ఎఫ్ తరపున సంస్థ సీనియర్ అధికారి వెంకట్ భాస్కర్ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ పి.ముకుంద రెడ్డి పాల్గొన్నారు.